# ఐడియా

### యం. రామశాస్త్రి

**ఆ రోజు మధ్యాహ్నం ఒకే ఒక క్లాసుండడంతో మూకుమ్మడిగా క్లాసెగ్గొట్టి సరదాగా సినిమా కెళ్ళాలని నిశ్చయించాం.**

**అమ్మాయిల బృందం ముందుగా వాళ్ళ కతి సహజమైన బెట్టు చూపించినప్పటికీ కాస్సేపు సంప్రతింపులు, సల్లాపాల సరిగమలు జరిపాక సరే అనక తప్పలేదు.**

కాలేజీ కుర్రాళ్ళే కదా సినిమా హాళ్ల మహారాజ పోషకులు! కాబట్టే ఎక్కడెక్కడ విద్యాలయాలుండునో ఆ చుట్టుపక్కల కనీసం నాలుగయిదు సినిమా హాళ్ళుండటం ఆంధ్ర దేశంలో, అందునా మన భాగ్య నగరంలో ఇది రివాజే కదా!

ఎవరివాళ్ళ కనుగుణంగా వాళ్ళ వాళ్ళ బృందాలతో దండయాత్రకి బయలుదేరాం చుట్టుపక్కల వున్న సినిమాహాళ్లపై. ఎండ పెరపెరలాడేస్తున్నా ఎంత మాత్రం తగ్గతల్చుకోలేదు ప్రజలు. అందునా మేం వెళ్ళింది కొత్తగా రిలీజైన చిరంజీవి సినిమా ఆయె!

ఒకప్రక్క వేడి, ఉక్కపోత విపరీతంగా. వీటినెంత మాత్రం గుర్తించకుండా ఇంకోవైపు అనంతంగా పెరిగిన హనుమంతుని తోకలా క్యూలో నిల్చున్న జనాన్ని చూసే సరికి మా వాళ్ళంతా ఒక్కటే జావకారిపోయారు.

"ఇంకేం ప్రక్క హాల్లో ప్రయత్నిద్దాం పదండి!" అన్నాడు రమేష్.

"ఫర్వాలేదురా. అక్కడ మాత్రం ఇలా వుండదని గ్యారంటే ఏమిటి?" అన్నాడు సుబ్రావ్ జాలిగా.

సుబ్రావ్‌గాడికి చిరంజీవిపై వున్న భక్తి, ఆరాధన చూసి చెప్పొద్దూ నాకు భలే సరదా అనిపించింది. "వీడి పాయింటు కరెక్టే కదా" అన్నాన్నేను.

"ఏడిశావ్. అందులో వుంది చిరంజీవిగాడి సిన్మా కాదు. కాబట్టి దొరికే అవకాశాలెక్కువ" అన్నాడు సుధాకర్.

వీడొహ అమితాబ్ భక్తుడు. ప్రక్కన నడుస్తున్న అట్టర్ ఫ్లాప్ అమితాబ్ సినిమా ఏడవసారి చూడచ్చని వీడాశ.

"కాదురా లైన్లో ముందున్నవాళ్ళకి డబ్బులిచ్చి కాస్త రిక్వెస్టు చేద్దాం" అన్నాడు వాడదే జాలి మొహంతో.

ఇంక నేను ఆగలేకపోయాను. "సరేరా అలాగే ప్రయత్నిద్దాం" అని హనుమంతుని తోకంతా పరికించి చూస్తే ఒక్కడూ తెలిసిన మొహం కనిపించడంలేదు. ఒకళ్ళిద్దరి వద్ద ప్రయత్నిస్తే, ఒకడాముదం మొహం పెట్టి "నాకే అయిదు టిక్కెట్లున్నాయి" అన్నాడు. ఇంకొకడు కర్కశంగా "మేం అప్పటి నుంచి లైన్లో నిల్చుంది ఇప్పుడే వచ్చిన మీకు తీసుకోవడానికి కాదు బాబు, వెళ్ళి కాస్త లైన్లో నిల్చోరాదూ" అంటూ ఒక ఉచిత సలహా పడేశాడు.

మావాడి బేల మొహం చూస్తుంటే ఇంకా ఏదైనా చేయాలనిపిస్తూంది. "ఒరేయ్! లేడీస్ క్యూలో ప్రయత్నిద్దాం. పాపం వాళ్ళు మగ వెధవలంత కర్కశంగా వుండరు కదా. కాస్త ఇదిగా అడిగితే ఎవరో ఒకళ్ళు తీసుకోకపోరు!" అన్నాను.

"గురూ భలే అయిడియా! అదిగో ఆ ఎర్ర పరికిణీ అమ్మాయిని చూశావు? ఆ అమ్మాయిల గుంపుకు



నాయకురాలిగా వుంది. నా సామిరంగా! వాళ్ళు మనలాగే క్లాసెగ్గొట్టిన బాపతుగాళ్ళులా వున్నారు" అన్నాడు అప్పటిదాకా మా గొడవేమీ పట్టించుకోకుండా ఆ అమ్మాయిల గుంపును చూసి ఆనందిస్తున్న బ్రహ్మానందరావు.

ఇక్కడ వాడి గురించి కాస్త చెప్పాలి. పేరుకు తగ్గట్టే బ్రహ్మానందరావు ఎప్పుడూ ఆనందంగా, సరదాగా మా అందరికన్నా కాస్త అందంగా వుంటాడు. సాహసికంగా మా నుంచి విడిపోయి కనిపించిన అమ్మాయిలతో కలిసి విహరించడం వాడికున్న అతి ముఖ్యమైన హాబీ. కాస్త పొగిడెయ్యగానే ఆనందంగా ఒప్పుకున్నాడు వెళ్ళి ఆ అమ్మాయినడగడానికి.

అలా వెళ్ళినవాడు కాస్తా అయిదారు నిమిషాల్లో గోడకు కొట్టిన బంతిలా, వాడిపోయిన తోటకూర కాడకు మల్లే వేళ్ళాడుతున్న మొహంతో వెర్రి నవ్వొకటి పులుముకుని వచ్చాడు "శశిరేఖంట గురూ దాని పేరు!" అంటూ నావైపు చూసి.

"అమ్మయ్య! బ్రతికించావురా నాయనా. ఎవర్తో ఒక రేఖ. నువ్విలా వస్తుంటే చూసి అనుకున్నాను మన పని అయిపోయిందని" అన్నాను నవ్వొకటి పులుముకుని.

"అఫ్‌కోర్స్! సారీరా బ్రదర్! రిజల్టు నెగిటివే. కాని భలే స్మార్టుగా అందిరా బ్రదర్ మొగవాళ్ళ క్యూ వైపు చూపెడుతూ, అక్కడ నుల్చోండని" తన్మయత్వంతో చావు కబురు చల్లగా చెప్పాడు.

వాణ్ణి తిట్టాల్సినంతా తిట్టి, "పదండ్రా వెధవ సినిమా! దొరక్కపోతే పోయింది" అన్నాడు రమేష్.

ఎలక్షన్లో డిపాజిట్టు కోల్పోయిన మొహంలా తయారైన సుబ్రావ్‌గాడి మొహం చూస్తే కదలాలనిపించడం లేదు. "పోనీ బ్లాకులో ట్రై చేద్దాంరా" అన్నాను.

"వెధవ సినిమా. ఎప్పుడైనా మళ్ళీ చూడొచ్చు. అక్కర్లేదు పదండి" అన్నాడు సుబ్రావ్‌గాడు.

అప్పుడే బుకింగ్ తెరవడంతో ఒక్కటే త్రొక్కిసలాట. ఈ గందరగోళం మధ్య నుంచి బయటపడుతుంటే అప్పుడొచ్చిందొక అయిడియా!

"ఒరేయ్ బ్రహ్మానందం ఆ అమ్మాయి పేరేమన్నావు. రేఖ కదూ?"

"కాదు శశిరేఖ! ఏం?" అన్నాడు అనుమానాస్పదంగా నా వైపు, ఎదురుగా లైన్లో కౌంటరుకు కొద్దిగా సమీపంగా వున్న ఆ అమ్మాయివైపు చూస్తూ.

"నేను ట్రై చేస్తాన్రా వెళ్ళి" అన్నాను చిరునవ్వుతో సుబ్రావ్ భుజం తట్టి.

"ఒరే నరేంద్రా! కొంపతీసి నీకా అమ్మాయి తెలుసేంటి?"

అవును, కాదు అన్నట్టు బదులుగా ఒక చిరునవ్వు నవ్వి ముందుకు సాగాను.

* * *

ఇంటర్వెల్ అవగానే ప్రశ్నార్థకపు మొహాలతో అందరూ ఆతురతగా నా మొహంలోకి చూస్తుంటే నిజంగా నాకు నవ్వాగడం లేదు.

"ఒరేయ్ నీ వెధవ సస్పెన్సుతో మా అందరి రక్తం గడ్డకట్టకముందే కాస్త విషయమేంటో చెప్పరా నాన్నా" అంటున్న సుబ్రావ్‌గాడి మొహంలోకి చిరునవ్వుతో ఒకసారి చూసి చెప్పడానికి ఉద్యుక్తుణ్ణయ్యా.

* * *

"హల్లో శశిరేఖ గారూ"



ఇటీవల తణుకులో గురజాడ విద్యానికేతన్ వార్షికోత్సవం జరిగిన సందర్భంలో ప్రముఖ నాటక రచయిత, దర్శకుడు శ్రీ కె.జె.ఎస్.రామారావు (సి.తా.రె)ను సినీ నటులు శ్రీ గుమ్మడి సత్కరిస్తున్న దృశ్యం

"ఆ...."

"కులాసానా?"

"ఆ...మీరు....?"

"ఇహ్హిహ్హి.....సినిమా కొచ్చారా!" — మన తెలుగు వాళ్ళ క్లాసికల్ జోక్!

"ఆ ... అవును....మీరు?"

"ఆ! బైదిబై — ఇఫ్ యూ డోన్ట్ మైండ్ కెన్ యూ గెట్ మీ ఫైవ్ టికెట్స్..."

"ఒ...కె..."

"తీసుకోండి."

"థాంక్యూ వెరీ మచ్ శశిరేఖగారు."

"మీ...మీరు....అన్నట్టు మీరు.....?"

"నేనండి నరేంద్రని! చంపేశారు — నన్నప్పుడే మరచిపోయినట్లుంది. ఆమధ్య నేను, మా నాన్నగారు కలిసి మీ ఇంటికి వచ్చాం. మీ నాన్న చలపతిరావుగారు కులాసా?"

"అయ్యో లేదండి."

"అయ్యో వారికి బాగా లేదా?"

"అబ్బబ్బ అదికాదు. మా నాన్నగారి పేరు పురుషోత్తమరావు. మేముండేది నల్లకుంటలో బహుశః మీరు పొరపడి వుంటారు."

"వ్వాట్?"

"అవును."

"ఓహ్...ఐ....ఐ....ఐ యామ్ సారీ అండి."

"ఫరవాలేదు. ఇట్సాల్ రైట్. ఐ యామ్ శశిరేఖ, బి.ఎ. ఫైనల్ ఫ్రమ్ కోఠి విమెన్స్ కాలేజి. ఎనీ హౌ గ్లాడ్ టు మీట్ యూ!"

"ఓహ్! సేమ్ విత్ మీ అండి. వాటె ప్లెజంట్ సర్‌ప్రైజ్—"

"సినిమాకి టైమవుతుందండి. సీ యూ."

"ఓ.కె. బై."

## అంకితం

రోజురోజుకి నీవు తెలుగు మర్చిపోతున్నావంటూ ప్రతిరోజు సరదాగా టీజ్ చేసే ప్రియ సోదరి ఉషకు ఈ నా కథ అంకితం.

—రచయిత

